

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ చెప్పింది...

**"అమ్మా! ఏం చేస్తున్నావు? నిద్రపోలేదా?"** చంద్రం నెమ్మదిగా మాట్లాడుతున్నా నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో ఆ ధ్వని పెద్దగా వినిపించింది.

తొలి సమాగమపు మత్తులో సుషుప్తిలో ఉన్న ప్రీతి ఆ మాటలకి బద్ధకంగా కళ్ళు విప్పి చూసింది. కిటికీ దగ్గర నించుని ఫోనులో మాట్లాడుతున్నాడు చంద్రం.

"ప్రీతి నిద్రపోతోందమ్మా."

"..."

"అంటే తను ఈ మూడు రోజులుగా పెళ్ళి హడావిడికి అలసిపోయింది."

"..."

"నిజమే. నేనూ అలసిపోయా కానీ ప్రీతి నాకంటే సుకుమారి కదా." చిన్నగా నవ్వాడు.

"..."

"సరే అమ్మా. ఇక ఉంటా." ఫోన్ పెట్టేసి చంద్రం మంచం దగ్గరికి నడిచాడు.

తన పక్కన పడుకున్న అతన్ని ఇష్టంగా చూస్తూ అడిగింది ప్రీతి.

"ఎవరితో? ఈ టైంలో?"

"అమ్మతో."

"ఏదైనా ఎమర్జన్సీనా?" ఆదుర్దాగా అడిగింది.

"లేదు. అమ్మ వంటరిగా ఫీలవుతుందని... అదీ కాక నేనెలా ఉంటానో అని అమ్మకి కంగారు కదా?" నసిగాడు.

"ఎలా ఉంటావో? అంటే?" లేచి కూర్చుని అడిగింది.

ఏం చెప్పాలో అర్థం కాక మౌనంగా ఉండిపోయాడు చంద్రం.

"ఇది అడవి కాదు. త్రీ స్టార్ హోటల్. రెండు గంటల క్రితమే నా పేరెంట్స్, మీ మమ్మీ మనతో డిన్నర్ చేసి ఇళ్ళకి వెళ్ళారు. ఇందులో మీ మదర్ కంగారు పడాల్సిన విషయం ఏముంది? నేను మా వాళ్ళకి ఫోనేం చేయలేదే? అసలు కంగారు అంటే ఏంటి చంద్రం? నేను రాక్షసిని అనుకుంటున్నారా?" కోపంగా అడిగింది.

"సారీ! నేను సరిగ్గా చెప్పలేకపోయాను. నాకు రోజూ పడుకోబోయే ముందు మా అమ్మతో మాట్లాడటం అలవాటు. ఇవాళ చేయకపోతే ఫీలవుతుందేమోనని చేసాను. అమ్మ కూడా నా కాల్ కోసం చూసి రాకపోయేసరికి కంగారు పడిందట." సంజాయిషీ ఇచ్చాడు చంద్రం.

"అదే. ఆ కంగారు దేనికి? ఇది మన ఫస్ట్ నైట్. అసలు ఈ రోజు నీ కాల్ కోసం చూడటమే తప్పు." గట్టిగా చెప్పింది ప్రీతి.

"నన్నేమైనా అను ప్రీతీ. మా అమ్మని ఏమన్నా అంటే నాకు ఇష్టం ఉండదు." అటువైపు తిరిగి పడుకున్నాడు చంద్రం.

మర్నాడు ప్రీతి లేచే సమయానికి చంద్రం స్నానం కూడా చేసి సిద్ధంగా ఉన్నాడు.

"గుడ్మార్నింగ్. నువ్వు తయారైతే ఇంటికి వెళదాం." చెప్పాడు.

"అదేం? చెక్ అవుట్ టైం పన్నెండు కదా? నిదానంగా వెళదాంలే." బద్ధకంగా చెప్పింది.

"లేదు ప్రీతీ. అమ్మ వీలైనంత త్వరగా వచ్చేయమంది. మళ్ళీ మనం ఢిల్లీ వెళ్ళిపోతాం కదా. అప్పటిదాకా కొడుకు, కోడలు తన దగ్గర ఉండాలని అమ్మ కోరిక."

"రేపంతా ఉంటాం కదా?"

"ఇవాళ, రేపు కూడా ఉండాలని." స్థిరంగా చెప్పాడు చంద్రం.

మౌనంగా బాత్ రూంలోకి వెళ్ళిపోయింది ప్రీతి.

ఇంటికి వెళ్ళాక ప్రీతి అనే జీవి తమతో ఉందన్న విషయాన్ని ఆ తల్లీ కొడుకులు మర్చిపోయి మాట్లాడేసుకుంటున్నారు. ఒక్క రాత్రి దూరంగా ఉన్నట్లు లేరు వాళ్ళు. చిన్నప్పుడు తప్పిపోయి ఫేమిలీసాంగ్ ద్వారా పాతికేళ్ళకి మళ్ళీ కలుసుకున్నంత ఉద్విగ్నంగా ఉన్నారు.

ప్రీతి బెడ్ రూంలోకి వెళ్ళి తల్లికి ఫోన్ చేసింది.

"హాయ్ డార్లింగ్! ఇప్పుడే నాన్నకి చెప్తున్నా. పన్నెండు కల్లా మీ హోటల్ కి వచ్చి మీతో కలిసి లంచ్ తినేసి వద్దాం. వంట చేయడం లేదు అని. అప్పుడే లేచేసావా? డిస్టర్బ్ చెయ్యడం ఎందుకని నీకు కాల్ చేయలేదు." తల్లి చెప్పింది.

"అమ్మా. మేము చంద్రం వాళ్ళింటికి వచ్చేసాం." నెమ్మదిగా చెప్పింది ప్రీతి.

"అదేం? ఇంత త్వరగా ఎందుకు?" ఆవిడ తెల్లపోయింది.

"చంద్రంకి ఏవో అర్జెంటు పనులున్నాయిట. నువ్వు వంట స్టార్ట్ చెయ్." నవ్వి ఫోన్ పెట్టేసింది.

కొద్దిసేపు అతని కోసం ఎదురుచూసి నిద్రపోయింది ప్రీతి.

భోజనాల సమయంలో పనిమనిషి వచ్చి నిద్ర లేపింది.

మొహం కడుక్కుని డైనింగ్ హాల్ లోకి వెళ్ళేసరికి వాళ్ళిద్దరూ ఆమె కోసమే ఎదురు చూస్తున్నారు.

"వేళ కాని వేళలో నిద్రపోతున్నావు? రాత్రంతా నిద్ర లేదా?" ప్రీతి ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ ప్రశ్నించింది అత్తగారు.

సిగ్గుతో ప్రీతి ముఖం ఎర్రబడింది. 'ఇదేమిటి ఈవిడ ఇలా మాట్లాడుతున్నారు?' అనుకుంది. కానీ సమాధానం చెప్పలేదు.

ఆ రాత్రి పది గంటలకి కానీ చంద్రం ఏకాంతంగా దొరకలేదు.

"అదేంటి చంద్రం. పెళ్ళయి నాలుగు రోజులు కాలేదు. అప్పుడే బోర్ కొట్టేసానా? ఇవ్వాళసలు నాతో మాట్లాడనే లేదు." గోముగా అడిగింది.

"ఎల్లుండి నుంచి మనిద్దరమేగా ప్రీతీ. ఇవాళ, రేపు అమ్మతో గడిపితే నాకూ, తనకీ కూడా తృప్తి. నువ్వు మాదగ్గర లేకుండా ఎందుకు వచ్చేసావ్? అమ్మ చాలాసార్లు అంది. 'ప్రీతి కూడా వచ్చి కబుర్లు చెప్పచ్చుగా' అని. నేను పిలుస్తానంటే 'ఒద్దులే. రెస్ట్ తీసుకోనీ' అంది." చెప్పాడు.

ప్రీతికి మొదటిసారిగా, కొత్తగా తనకి బంధుత్వం కలిసిన ఆ అత్తగారి లౌక్యం మీద భయం, అసహ్యం ఏకకాలంలో కలిగాయి.

తన కొడుకుని తననించి దొంగిలించిన దొంగలా చూసే ఆవిడ చూపులని తట్టుకోలేక బెడ్ రూంకే పరిమితమైన ప్రీతి ఆ విషయాన్ని చంద్రంతో చెప్పదల్చుకోలేదు.

❦❦❦

"అమ్మా! ఏం చేస్తున్నావు? ... ప్రీతి వంట చేస్తోంది." తల్లితో ఫోన్లో మాట్లాడుతున్న చంద్రం రిసీవర్ కి చెయ్యి అడ్డు పెట్టి ప్రీతిని అడిగాడు.

"ప్రీతీ.. ఏం వండుతున్నావు?"

"వంకాయ" వంటింట్లోంచి అరిచింది ప్రీతి.

"ఎలా వండుతున్నావు?" మళ్ళీ అడిగాడు.

"ఉప్పు, కారం వేసి." కసిగా జవాబు చెప్పింది.

"అల్లం, పచ్చి మిరపకాయలతో చేస్తే బావుంటుందిట. అమ్మ చెప్పింది. అలాగే వండు."

"ఆల్రెడీ వండేసా." కోపంగా చెప్పింది ప్రీతి.

"సరే. ఇకనుంచి వండే ముందే చెప్పమంది అమ్మ. నాకేం ఇష్టమో, ఎలా చేస్తే ఇష్టమో నీకు చెప్తుందిట."... మళ్ళీ తల్లితో సంభాషణలో మునిగిపోయాడు చంద్రం.

ఆ రాత్రి ప్రీతి నెమ్మదిగా అడిగింది.

"నేను ఏ కూర ఎలా వండాలో కూడా మీ అమ్మ డైరెక్షన్స్ లో చేయాలా చంద్రం. ఆ మాత్రం కూడా నాకు తెలీదా?"

చంద్రం ముఖం కోపంతో ఎర్రబడింది.

"నన్నేమైనా అను. మా అమ్మని అంటే మాత్రం ఊరుకోను అని ముందే చెప్పాను. తను ఎంత చేస్తే నేను ఇంతవాడినయ్యానో నీకు తెలుసా? తెల్లవారు ఝామున నన్ను లేపి, నాతో పాటు కూర్చుని చదివించేది. టి.వి, సినిమాలు త్యాగం చేసింది. అందుకే నాకు నెలకి లక్షకి పైగా జీతం వచ్చే ఉద్యోగం దొరికింది. అందుకు నువ్వు మా అమ్మకి కృతజ్ఞతగా ఉండాలి."

"నీలాంటి వాడే వెనకటికి ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం అన్నాడట. మీ అమ్మ అనాథ పిల్లాడ్ని పెంచి, చదివించి పెద్ద చేస్తే అది గొప్ప. ప్రతీ తల్లీ తన పిల్లల్ని బానే పెంచుతుంది. వాళ్ళు బాగా చదువుకోవాలి, ఉత్తమ పౌరులు కావాలి అనుకుంటుంది. మా అమ్మ నన్ను అలాగే పెంచింది. కానీ నేను ప్రతీ చిన్న విషయంలో ఆమె సలహా తీసుకోను. మనం పెద్దయ్యాం. స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవాలి. అంతేకానీ ప్రతీ చిన్నదానికీ అమ్మ అంటే అసహ్యంగా ఉంటుంది." ప్రీతి ఆవేశంగా చెప్పింది.

చంద్రం హేళనగా నవ్వాడు.

"ఆంధ్రప్రదేశ్ లో పబ్లిక్ టాయిలెట్స్ కంటే ఇంజనీరింగ్ కాలేజీలు ఎక్కువ. అలాంటి ఓ చిన్న కాలేజీలో బిటెక్ చదివావు నువ్వు. ఇంకో చిన్న కాలేజ్ లో ఎం టెక్. నేను ఆల్ ఇండియా మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో యం.డి చేసిన డాక్టర్ ని. నీకూ నాకూ పోలిక చెప్తావేంటి? కాకపోతే మీ అమ్మ పెంపకానికి, మా అమ్మ పెంపకానికి తేడా మాత్రం స్పష్టంగా చెప్పావు. ఏటా లక్ష మంది నీలా ఇంజనీర్లు అవుతున్నారు. నాలా ఎంతమంది యం.డి లు అవుతారో తెలుసా?"

"నీకో విషయం తెలియడం లేదు. సంపాదనతో పోలిస్తే నాకూ దాదాపు నీ అంతే వస్తుంది. చదువులో పోల్చుకుంటే ఇద్దరిదీ మాస్టర్స్ డిగ్రీనే. ప్రవర్తన విషయానికి వస్తే నీకంటే చాలా మంచిదాన్ని. నీలా ఇంకా అమ్మ మీద ఆధారపడకుండా స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాను. వంట బాగా చేస్తాను. ప్రాజెక్ట్ పనుల మీద ఒక్కదాన్నే చాలా దేశాలకి వెళ్ళి సమర్ధవంతంగా పని చేసాను. నా పెంపకంలో నీకేం లోపం కనిపించింది చంద్రం?"

"పొగరు! నీకు చాలా పొగరు. నేనంటే లెక్క లేదు. మా అమ్మంటే లెక్క లేదు. నీకు అసలు భయం భక్తి లేవు. మా అమ్మతో కనీసం వారానికి ఒక్కసారైనా మాట్లాడమని ఎన్నిసార్లు చెప్పాను? ఈ ఆర్నెల్లలో ఎన్నిసార్లు మాట్లాడావు? " ఉగ్రంగా అరిచాడు చంద్రం.

"నీకు నేను ఎందుకు భయపడాలి చంద్రం? నువ్వేమైనా పులివా సింహానివా? నాలాంటి మనిషివే కదా? భర్తంటే ప్రేమ, అభిమానం ఉండాలి కాని భయం, భక్తి ఉండకూడదు. మీ అమ్మ నాకు ఏమవుతుందో, మా అమ్మ నీకు అదే వరస. ఈ ఆర్నెల్లలో నువ్వు మా అమ్మతో ఎన్నిసార్లు మాట్లాడావు?" అదే స్థాయిలో అరిచింది ప్రీతి.

ఏం మాట్లాడాలో తెలియక 'ఛీ' అంటూ అక్కడినించి విసురుగా వెళ్ళిపోయాడు చంద్రం.

చంద్రం మంచివాడే కాని వాళ్ళమ్మ అతనికి ఉగ్గుపాలతో పాటు అతనికోసం తనెంత కష్టపడిందో ఎన్ని త్యాగాలు చేసిందో రంగరించి పోసింది. ఆ కృతజ్ఞతాభావం నించి అతను బయటికి రాలేకపోతున్నాడు. ఏం చెయ్యాలి?

ఎంత ఆలోచించినా ప్రీతికి పరిష్కారం దొరకలేదు. తమ మధ్య ఈ అత్తగారు లేకపోతే జీవితం ఎంత హాయిగా ఉండేది అనిపించింది. మళ్ళీ వెంటనే చెంపలేసుకుంది. తప్పు! ఇంకొకరి గురించి ఇలా ఆలోచించానేమిటి? నా సంస్కారం ఏమైంది అని కొద్దిగా దిగులు పడింది. చెదురు మదురు సంఘటనలు మినహా ఫర్వాలేదు. కనీసం ఇలాగైనా ఉంటే చాలు అనిపించింది.

**********

"ప్రీతీ" భర్త పిలుపు విని ఏమిటన్నట్లుగా చూసింది.

"మనిద్దరం సంపాదిస్తున్నాం కదా? ఒక ఇల్లు కొనుక్కుందాం. ఈ ఇంటికి కట్టే అద్దె ఇఎమ్ఐ గా కట్టచ్చు. సాధ్యమైనంత త్వరగా లోన్ కూడా తీర్చేయచ్చు." హుషారుగా చెప్పాడు.

అతని వంక నిశితంగా చూసి అడిగింది.

"మంచి ఆలోచనే. ఇప్పుడే తట్టిందా?"

"లేదు. అమ్మ చెప్పింది. నెలకి నలభై వేలు అద్దె దండగ. అద్దె ఇంటికి చాకిరీ దండగ. సొంతిల్లు కొనుక్కోండి అంది."

"నాకు స్వీడన్ లో త్రీ ఇయర్స్ ప్రాజెక్ట్ వచ్చింది చంద్రం. అక్కడికి వెళ్ళాలి. మరి లోన్ నువ్వొక్కడివే కట్టగలిగితే కొను. లేదా మీ అమ్మ దగ్గర ఉంటే తీసుకో. డౌన్ పేమెంట్ కి కూడా నేనేమీ ఇవ్వలేను." నిదానంగా చెప్పింది.

"అమ్మా ప్రీతి..." ఫోన్లో తల్లితో మాట్లాడుతూ బయటకి వెళ్ళిపోయాడు చంద్రం.

అరగంట తర్వాత లోపలకి వచ్చి చెప్పాడు.

"పెళ్ళి కాక ముందు ప్రాజెక్ట్ లు అంటూ తిరిగితే ఓకే. కానీ ఇప్పుడు మూడేళ్ళు వెళ్తానంటే ఎలా? ఇక్కడ నేను ఒంటరిగా ఉండాలి. వెళ్ళనని చెప్పెయ్."

"పోనీ నువ్వూ నాతో రా. నేను మానేయడానికి లేదు."

"నేను వచ్చి ఏం చేస్తాను అక్కడ?"

"విద్వాన్ సర్వత్రా పూజ్యతే అన్నారు చంద్రం. నువ్వు గొప్ప తెలివైన డాక్టర్ వి. అక్కడ పని చేయచ్చు. కోపాన్ని అణచుకుంటూ చెప్పింది ప్రీతి.

మళ్ళీ గబగబ ఫోన్ తో బాల్కనీలోకి వెళ్ళాడు చంద్రం. ఈ సారి పావుగంటలో వచ్చి చెప్పాడు.

"మన పెళ్ళయి దాదాపు ఏడాది అవుతోంది. నీకు ఆల్ రెడీ ముప్పై ఏళ్ళు వచ్చేసాయి. ఇక కుటుంబ నియంత్రణ మానేసి పిల్లల్ని ప్లాన్ చేద్దాం."

"డాక్టర్ గా చెప్తున్నావా చంద్రం?" అడిగింది.

"అమ్మ చెప్పింది. డాక్టర్ గా కూడా చెప్తున్నాను. ముప్పై ఏళ్ళ లోపు లేడీస్ పిల్లల్ని కంటే వాళ్ళు ఆరోగ్యంగా ఉంటారు. ముప్పై దాటితే మళ్ళీ డౌన్స్ సిండ్రోమ్ లాంటి ప్రాబ్లమ్స్ రావచ్చు." హెచ్చరికగా చెప్పాడు.

ప్రీతి ఏమీ మాట్లాడలేదు.

"నెల తప్పగానే నువ్వు ఉద్యోగం మానెయ్. నా కొడుకు భారతీయుడిగా పుట్టాలి కాని, స్కాండినేవియన్ గా కాదు. నా సంపాదన మనిద్దరికీ చాలు. లేదా ఇంట్లో ఉండి నువ్వు డేటా ఎంట్రీ లాంటి జాబ్ చేయచ్చు."

"ఇది కూడా మీ అమ్మ చెప్పిందా?" తీక్షణంగా అడిగింది ప్రీతి.

"అవును. నాకు మా అమ్మ కంటే వెల్ విషర్ ఎవరూ లేరు. మీ అమ్మ ఇలాంటి సలహాలు చెప్పక నిన్ను గాడిదలా పెంచిందని కూడా మా అమ్మ చెప్పింది."

ప్రీతి మొహం అవమానంతో ఎర్రబడింది.

"చంద్రం! మీ అమ్మ మూలంగా, కేవలం మీ అమ్మ కారణంగా నీకు విడాకులు ఇవ్వబోతున్నాను. నా ఆర్థిక వ్యవహారాల్లో, నా ఉద్యోగం విషయంలో, నా పిల్లల విషయంలో మూడో వ్యక్తి జోక్యం నాకిష్టం లేదు. అది మీ అమ్మ కానీ మా అమ్మ కానీ. రేపు మనిద్దరం వెళ్ళి మ్యూచువల్ అండర్ స్టాండింగ్ తో విడాకులు తీసుకుందాం. నా సహనం చచ్చిపోయింది..."

"అమ్మా ప్రీతి..." ఫోన్ పట్టుకుని చంద్రం హడావిడిగా బాల్కనీలోకి వెళ్ళి పోయాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story